క్లుప్తంగా

30 నుంచి తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు



తంటికొండలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి

గోకవరం: తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 30వ తేదీ నుంచి మే 6వ తేదీ వరకూ జరుగుతాయని దేవస్థానం ఈఓ ఆర్‌వీ చందన గురువారం తెలిపారు. ఏడు రోజుల పాటు నిర్వహించే ఈ కల్యాణోత్సవాల్లో తొలిరోజు స్వామి, అమ్మవార్లను పెళ్లికుమారుడు, పెళ్లి కూతురుగా చేస్తారన్నారన్నారు. మే ఒకటో తేదీన రాత్రి ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలోని మండపంలో స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. భక్తులంతా ఈ కళ్యాణోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

పెదపూడి: మండలంలోని 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను పక్కాగా తయారు చేయాలని ఈవోపీఆర్డీ కె.హరికృష్ణసత్యరెడ్డి అన్నారు. గురువారం ఆయన జూమ్ మీటింగ్ ద్వారా పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ నిర్దేశించిన 9 అంశాల ఆధారంగా పంచాయతీ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులను కలిపి ఏ పనికి ఎంత అవసరమవుతుందో ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

భోజనం వితరణ



భోజనం అందిస్తున్న దాత కుమారుడు కల్యాణ్

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయి బాబా వసతి మందిరం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం మినిరెడ్డి స్వీట్‌స్టాల్ అధినేత గొలుగూరి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 150 మంది నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. మందిరం సేవాసమితి సభ్యులు నిరుపేదల ఇళ్లకు వెళ్లి వీటిని అందించారు.


దంత వైద్యశిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

సీతానగరం: రఘుదేవపురంలోని డాక్టర్ సత్యం రమేష్‌బాబు హాస్పిటల్లో రాజమహేంద్రవరం సాయిరామ్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు రామ్‌కుమార్, శ్రీలేఖ, సత్యం రమేష్‌బాబు.. 50 మందికి దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈర్పిన సుధాకర్, పరిమి వెంకటకృష్ణ, వై.వెంకట నారాయణ, కాండ్రు సుబ్బారావు పాల్గొన్నారు.

వంద మందికి కంటి పరీక్షలు



తంటికొండలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: తంటికొండలో గురువారం వైఎస్సార్ కంటి పరీక్షలు, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ బద్దిరెడ్డి సత్యనారాయణమ్మ ప్రారంభించారు. డాక్టర్ కిరణ్, కంటి డాక్టర్ వెంకట్రావు సుమారు వంద మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బద్దిరెడ్డి అప్పన్నదొర తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి పర్యటన

రాజానగరం: పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగానికి ప్రభుత్వ సలహాదారుగా ఉన్న పోరెడ్డి నాగార్జునరెడ్డి మండలంలో ఆ శాఖకు సంబంధించి జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలిస్తారని ఎంపీడీఓ బి. రామారావు తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి ఉదయం చేరుకుని, అక్కడ నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లతో సమీక్ష నిర్వహిస్తారన్నారు.

కోరుకొండ బియ్యం.. పోషకాలు పుష్కలం

- ఈ ధాన్యానికి ఎంతో ప్రత్యేకత
- ఒకే పంట విధానంతో నాణ్యత
- కొనుగోలుదారుల ఆసక్తి



శ్రీరంగపట్నంలో వరి కుప్పలు

మధురపూడి: మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ బియ్యానికి ఎంతో ప్రత్యేకత ఉంది. చాలా ఏళ్లగా ఇక్కడి ధాన్యాన్ని కొనడానికి వినియోగదారులు మక్కువ చూపుతారు. బాలింతలకు ఆహారం ఇవ్వడానికి ఎక్కువగా వాడతారు. బ్రిటీషు పాలనలో కూడా ఇక్కడి బియ్యాన్ని సైనికులకు ఆహారంగా ఇచ్చేవారని చెబుతారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో మధురపూడిలో ఏర్పాటుచేసిన ఎయిరోడ్రామ్‌లో ధాన్యాన్ని నిల్వ ఉంచేవారని, అక్కడి నుంచి తీసుకెళ్లేవారని పూర్వీకులు చెబుతూ ఉంటారు. గతంలో బూరుగుపూడి నియోజకవర్గంగా పిలువబడిన ఈ ప్రాంతంలోని ధాన్యాన్ని కొనడానికి సుదూర ప్రాంతం నుంచి వ్యాపారులు వచ్చేవారు.

వర్షాధారం

కోరుకొండ ప్రాంతంగా పిలువబడే కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లోని చాలా ప్రాంతాల్లో పూర్తిగా వర్షాధారంతో వ్యవసాయం చేస్తారు. మెట్ట ప్రాంతం కావడం, నీటి సౌలభ్యం లేకపోవడంతో ఒక్క పంటనే పండిస్తారు. దీంతో బియ్యానికి ఎంతో నాణ్యత వస్తుంది. ప్రస్తుతం రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో బోర్లు, సాగునీటి సదుపాయం ఏర్పడటంతో రెండోపంట సాగవుతోంది. అయినప్పటికీ అత్యధిక గ్రామాల్లో మొదటి పంటగా వరిని, రెండో పంటగా మినుము, పెసర సాగు చేస్తున్నారు. అయితే ఉద్యానవనాల విస్తీర్ణం పెరగడంతో వరిసాగు గతం కంటే తగ్గింది.

బియ్యానికి ఎంతో నాణ్యత

కోరుకొండ ప్రాంతంలో ఒకే పంట సాగు విధానాన్ని అవలంబించడంతో బియ్యానికి ఎంతో నాణ్యత వచ్చింది. పొలాల్లో సారం నిలుస్తోంది. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటను నవంబర్, డిసెంబర్ నెలల్లో కోస్తారు. దాన్ని కుప్పలుగా వేస్తారు. కోతలు కోయక ముందే మినుము, పెసర చల్లుతారు. కుప్పల్లోని ధాన్యాన్ని ఏప్రిల్‌లో నూర్చుతారు. అప్పటి వరకూ కుప్పల్లోని ధాన్యం బాగా మగ్గి, నాణ్యత ఏర్పడుతుంది. ఈ ధాన్యం నుంచి వచ్చిన బియ్యంలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని నమ్మకం. గతంలో కోరుకొండ బియ్యానికి బ్రాండ్ లేదు. అయితే రెండేళ్ల నుంచీ సూర్య మహాలక్ష్మి బ్రాండ్‌తో విక్రయాలు జరుపుతున్నారు.



సూర్యమహాలక్ష్మి బ్రాండ్ బియ్యం

మంచి గిరాకీ



కోరుకొండ ప్రాంతంలోని బియ్యం కోసం భద్రాచలం, అమలాపురం, కాకినాడ తదితర చోట్ల నుంచి అనేక మంది వచ్చేవారు. గోదావరి మీదుగా లాంచీల్లో బియ్యాన్ని భద్రాచలానికి తరలించేవారు. అలాగే వివిధ ప్రాంతాలకు ఇక్కడి రైస్ రవాణా అయ్యేది. జంబూపట్నంలో మేము పండించిన ధాన్యం కుప్పలు నూర్చిన తర్వాతే తింటాం.

– ఉల్లి బుజ్జిబాబు, రైతు నాయకుడు, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్

నాణ్యత ఎక్కువ

కోరుకొండ ప్రాంతంలో ఒకే పంట విధానంతో అవలంబించడం వల్ల ఇక్కడి బియ్యానికి నాణ్యత ఎక్కువగా ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లో కోరుకొండ మండలంలో 15,440 ఎకరాల విస్తీర్ణంలో సాగు జరిగింది. బీపీటీ, పీఎల్ తదితర రకాలను సాగుచేశారు.

– ఏ.గౌరీదేవి, మండల వ్యవసాయాధికారి

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి



ఈబీసీ లబ్ధిదారుల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా తులసి

పెదపూడి: రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమవుతుందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో ఈబీసీ నేస్తం లబ్ధిదారులతో గురువారం జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తుందన్నారు. ఈబీసీ నేస్తం పథకంలో 45 నుంచి 60 సంవత్సరాల లోపు మహిళలకు ఒక్కొక్కరికి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి శ్రీవెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, మండ రాజారెడ్డి, కేతా శ్రీనివాస్, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



వంగలపూడిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పేరిచర్ల శ్రీనివాసరాజు, సచివాలయ కన్వీనర్ మద్దంశెట్టి గాంధీ, గృహసారథి కొక్కిరిపాటి సత్యనారాయణ కోరారు. గురువారం వంగలపూడిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. బుక్‌లెట్‌లోని ప్రశ్నలకు జవాబులు రాబట్టి, మిస్డ్ కాల్ చేశారు. అనంతరం ఇళ్లకు, సెల్‌ఫోన్‌లకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అతికించారు. వలంటీర్ పుట్టగంటి సురేఖ పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య

అనపర్తి: గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రామవరంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం రామవరం సోమాలమ్మ గుడి ప్రాంతానికి చెందిన సత్తి లక్ష్మి(55) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గురువారం ఉదయం లక్ష్మి ఇంటిలో కనిపించకపోవడంతో ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. గ్రామంలోని పెద్ద నుయ్యిలో మహిళ మృతదేహం ఉందన్న సమాచారంతో లక్ష్మి కుమారులు అక్కడకు వెళ్లి చూసి మృతదేహం తమ తల్లిదిగా గుర్తించి అనపర్తి పోలీసులకు సమాచారమిచ్చారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా అనంతరం మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి చిన్న కుమారుడు రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



కొత్తతుంగపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కొత్తతుంగపాడులో గడప గడపకూ..

రాజానగరం: గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కొత్తతుంగపాడులో గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ, క్షేమాలను తెలుసుకుంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. గత నాలుగేళ్లలో కొత్తతుంగపాడులో రూ. 3.74 కోట్లతో అమలు చేసిన వివిధ అభివృద్ధి పథకాలను వివరించారు. ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసేలా జలజీవన్ మిషన్ ద్వారా రూ.48 లక్షలతో ఓహెచ్‌ఆర్ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రజలకు మెరుగైన పాలనను అందించేలా రూ.75 లక్షలతో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించామన్నారు. రజకుల కోసం రూ.12 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మించామన్నారు. నాడు – నేడు పథకంలో రూ. 17 లక్షలతో ప్రభుత్వం పాఠశాలను అభివృద్ధి చేశామని, రూ.45 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, సర్పంచ్ కోలపాటి వెంకన్న, ఎంపీటీసీ లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ కోకన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి



భగీరథుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కేతా తులసి



పెంటపల్లిలో కేక్ కట్ చేస్తున్న సగర సంఘం సభ్యులు

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గండికోట వీరభద్రరావు భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగను భూమి మీదకు తీసుకొచ్చిన భగీరథుని విగ్రహం తమ గ్రామంలో ఉండడం శుభసూచికమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు సాయిబాబా సాగర్, నక్క వీరాస్వామి, స్థానిక నాయకులు గండికోట అప్పారావు, గండికోట గోవిందు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద భగీరథ మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కేతా తులసి భగీరథుని చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పోకల విజయభాస్కర్, ఈవోపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి, న్యాయవాది కేతా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పెంటపల్లిలో భగీరథ జయంతి

గోకవరం: పెంటపల్లి గ్రామంలో గురువారం సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై యు.వి. శివనాగబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువకులు భగీరథుని జీవిత చరిత్రను భావితరాలకు అర్థమయ్యే రీతిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల ప్రతిభ

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో 36 శాతం, ద్వితీయ సంవత్సరంలో 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం విద్యార్థి పి.మణికంఠ(ఎంపీసీ) 436 మార్కులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థి సిరిపల్లి జ్యోతి (బైపీసీ) 959, వెంకట రమా ప్రవీణ (ఎంపీసీ) 955, సీఈసీ విద్యార్థి పిల్లి లక్ష్మీదుర్గ 894 మార్కులతో ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 44 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 8వ స్థానాన్ని సాధించామని కాలేజీ ప్రిన్సిపాల్ శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.రామచంద్రరావు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: మల్లంపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఈ కారణంగా మల్లంపూడి, ముక్కినాడ, తోకాడ గ్రామాలకు ఆ సమయంలో సరఫరా ఉండదన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సీజీఆర్ఎఫ్



మాట్లాడుతున్న వేదిక చైర్మన్ సత్యనారాయణ

మధురపూడి: సమస్యలు పరిష్కారానికే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) నిర్వహిస్తున్నట్టు ఆ వేదిక చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాల పరిధిలో ఈపీడీసీఎల్ సంస్థకు సంబంధించిన ఎటువంటి సమస్యలు వచ్చినా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు అందిన తర్వాత దర్యాప్తు చేస్తామని, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ద్వారా 60 రోజుల్లో తీర్పు చెబుతామన్నారు. తీర్పు ఆర్డర్ కాపీని ఫిర్యాదుదారుని ఇంటికే పంపిస్తామన్నారు. ఇందులో భాగంగా కోరుకొండలో కోర్టు నిర్వహించామన్నారు. ముందుగా ఎయిర్‌పోర్టు సమీపంలోని వికాస ఫార్మసీ కాలేజీలో విద్యార్థులకు విద్యుత్ వినియోగం, సమస్యల పరిష్కారానికి వేదిక నిర్వహించే పద్ధతులను వివరించారు.

విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి



రంగంపేట శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో కె.శ్రీనివాసరావు

రంగంపేట: పాఠశాల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వామం కావాలని ఎంఈవో కె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ నివేదిక యాప్‌లో నమోదుపై ఒక్క రోజు శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల పరిశుభ్రత, పాఠశాల విద్యాభివృద్ధికి తీసుకోవలసిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ఎస్.శ్రీనివాస్ వ్యవహరించి యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఏపోజే స్నేహలత, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన వ్యాన్

వ్యక్తి మృతి, మరొకరికి గాయాలు

రంగంపేట: రంగంపేట మండలం పాత వీరంపాలెం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం పాత వీరంపాలెం గ్రామానికి చెందిన ముత్తాబత్తుల సురేష్(26)(తండ్రి సత్తిబాబు), ముత్తాబత్తుల సురేష్(తండ్రి ప్రకాష్)లు కలిసి బైక్‌పై పొలానికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న ముత్తాబత్తుల సురేష్(తండ్రి సత్తిబాబు) తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుల్దిరినీ 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి ముత్తాబత్తుల సురేష్(26) తండ్రి సత్తిబాబు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

శాస్త్రవేత్తలు చెప్పే మెళకువలు పాటించాలి



జి.దొంతమూరులో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి వి.రాధాకృష్ణ

రంగంపేట: శాస్త్రవేతలు చెప్పే మెళకువలు పాటించాలని జిల్లా ఉద్యాన అధికారి వి.రాధాకృష్ణ అన్నారు. గురువారం ఆయన మండలంలోని జి.దొంతమూరు గ్రామంలో ఆయిల్‌పాం, కొబ్బరి తోటల్లో తెల్ల దోమ నివారణ చర్యలపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు సంబంధించిన సమస్యలపై ఎప్పటికప్పుడు ఆర్‌బీకేల్లోని సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ తెల్లదోమ తల్లి పురుగులను నివారించటానికి పసుపు జిగురు అట్టలు చెట్టు చుట్టూ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఆదర్శ, ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ, సర్పంచ్ జి.రమణ, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్

గోకవరం: పామాయిల్, కొబ్బరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించడం వల్ల ఆశించిన స్థాయిలో దిగుబడి సాధించవచ్చని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్ అన్నారు. గోకవరంలో గురువారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పామాయిల్, కొబ్బరి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తోటల్లో చీడపీడల నివారణ కోసం పసుపురంగు అట్టలు, ఆముదం రాసిన అట్టలు చెట్లకు కట్టాలని, దీని ద్వారా తెల్లదోమ ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓ పి.రిని, ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

సీతానగరం: చినకొండేపూడిలోని నాలుగు బొమ్మల సెంటర్ వద్ద గల షిర్డీసాయి వసతి మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం దాత ఆకాశపు వెంకటేశ్వరరావు సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మజ్జిగతో పాటు తాగు నీరు అందించారు.

నరసన్నకు ఒడిశా మాజీ సీఎం పూజలు



గిరిధర్ గమాంగ్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహ స్వామిని గురువారం ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్ దర్శించుకున్నారు. రాజమహేంద్రవరంలోని ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన స్వామివారి దర్శనానికి వచ్చారు. ముందుగా ఆయనకు అర్చకులు, ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ మేనేజర్ రవి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

తెల్లదోమ నివారణకు కృషి

మధురపూడి: పామాయిల్, కొబ్బరిని ఆశిస్తున్న తెల్లదోమ నివారణకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఉద్యానశాఖాధికారి వి.రాధాకృష్ణ సూచించారు. కోరుకొండ మండలం మధురపూడిలో గురువారం పామాయిల్, కొబ్బరి రైతులు, ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. పంటలను ఆశించే ఏచీడకైనా ప్రథమంగా వేపనూనె పిచికారీ చేయాలన్నారు. మండల అధికారి పి.రినీ, వ్యవసాయ శాఖ సహాయకుడు మహేష్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: ముగ్గళ్లకు చెందిన మానుపాటి సూర్యనారాయణపై నలుగురు దాడిచేసినట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ గురువారం తెలిపారు. పందుల విషయమై జరుగుతున్న గొడవల కారణంగా ఈనెల 21న రఘుదేవపురంలో కులపెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణపై రఘుదేవపురానికి చెందిన కుతాడ దుర్గాప్రసాద్, కుతాడ శివ, గాదె దుర్గాప్రసాద్, కిట్టయ్య కర్రలతో దాడి చేసి గాయపర్చారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసిన సూర్యనారాయణను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు భాస్కరరావు కన్నుమూత

సీతానగరం: ఉండేశ్వరపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కూచిమంచి భాస్కరరావు (83) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అక్కడకు వెళ్లి.. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, ఎంపీటీసీ మట్ట వెంకటరమణ తదితరులు భాస్కరరావు కుమారులు హనుమంతరావు, జగన్నాథరావు, రామకృష్ణకు ధైర్యం చెప్పారు.

అంగన్‌వాడీ హెల్పర్ ఉద్యోగానికి దరఖాస్తుల స్వీకరణ

పెదపూడి: అంగన్‌వాడీ హెల్పర్ ఉద్యోగానికి ఈ నెల 27 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సామర్లకోట ప్రాజెక్టు సీడీపీఓ జీవీ రమణమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రమైన పెదపూడి గ్రామంలో బీసీ రజకపేట–2లో ఎస్టీ రిజర్వేషన్ ఉన్నవారు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవొచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు వచ్చే నెల 8 చివరితేదీ అన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయాలి

గోకవరం: ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని గాదెలపాలెంకు చెందిన కౌలు రైతులు గురువారం డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో సుమారు 150 ఎకరాల్లో పండించిన పంటను ఆర్‌బీకేల వద్దకు తీసుకువెళ్లగా వ్యవసాయశాఖ అధికారులు కేవలం రబీ పంటను మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతున్నారన్నారు. దీనివల్ల తాము నష్టపోయే ప్రమాదం ఉందని, దీనిపై అధికారులు స్పందించి ఖరీఫ్‌లో సాగు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు కోరారు.